## కన్నెగంటి చంద్ర

బ్రిటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీబీఈ (కమాండర్ ఆఫ్ ది మోస్ట్ ఎక్సలెంట్ ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్) అవార్డు తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన డాక్టర్ కన్నెగంటి చంద్రకు లభించింది. బ్రిటన్‌లో 2024కు ఇవ్వనున్న అవార్డుల్లో డిసెంబర్ 29న ప్రచురితమైన ఆనర్స్ లిస్టులో చాలామంది ప్రముఖులుండగా.. అందులో చంద్రకు చోటు దక్కింది. బ్రిటన్‌లో వైద్యరంగంలో జనరల్ ఫిజీషియన్‌గా పనిచేశారు. 2020లో డిప్యూటీ లార్డ్ మేయర్‌గా ఎన్నికైన చంద్ర 2023లో లార్డ్ మేయర్ పదవికి పోటీ చేసి గెలిచారు.

nipuna 05.
Every Wednesday Free Supplement
31 జనవరి 2024
పేజీలు 8

# నీతి ఆయోగ్ బహుముఖ పేదరిక సూచీ



- కనీస అవసరాలు తీరే ఆర్జన లేకపోవడమే పేదరికం కాదు. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకోలేని అసక్తత, జీవితంలో ఎదగడానికి అవకాశాలు లేకపోవడం కూడా పేదరికమే. ఉదాహరణకు ఒక వ్యక్తికి ఆహారం, విద్య, వైద్యం వంటి కనీస అవసరాలు తీరకపోవడం పేదరికం ఎలా అవుతుందో, అదేవిధంగా అతడి ఆర్థిక ఎదుగుదలకు సహకరించే బ్యాంకు ఖాతా లేకపోవడం, మహిళల ఆరోగ్యంపై ప్రభావం చూపే సురక్షిత ప్రసూతి సౌకర్యాలు పొందకపోవడం వంటి అంశాలు కూడా వారి పరిస్థితులు మెరుగుపడకుండా ఉంచే పేదరిక కారకాలే.
- అందువల్ల నీతి ఆయోగ్ భారతదేశ పేదరిక అంచనాలను మరింత సమర్థవంతంగా బహుముఖ కోణంలో ఆవిష్కరించడానికి, ప్రపంచ పేదరిక అంచనాలను అనుసరించే Alkire and Foster (ఏఎఫ్) మెథడాలజీలోని పది కొలమానాలకు తోడు 'ప్రసూతి సౌకర్యాలు, బ్యాంక్ అకౌంట్' వంటివి కూడా జతచేసి, మొత్తం 12 అంశాల ప్రాతిపదికగా భారతదేశంలో బహుముఖ పేదరిక సూచీని ఏటా రూపొందిస్తుంది.
- ఈ బహుముఖ పేదరిక అంచనాలు ప్రభుత్వం చేపట్టే వివిధ సంక్షేమ, అభివృద్ధి చర్యలకు ప్రాతిపదికగా ఉంటాయి. కాబట్టి పేదరిక స్థాయి ఎక్కడ ఏ రీతిలో ఉంది. ఇండెక్స్‌లోని వివిధ కాలమానాల పరంగా ఏయే ప్రాంతాలు ఏయే స్థాయిలో ఉన్నాయనే విషయాలను దేశ, రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జిల్లాల పరంగా కూడా ఈ ఇండెక్స్ అందిస్తుంది.
- ప్రభుత్వ పథకాల సమర్థవంత అమలుకు సహకరిస్తుంది. పేదలు, పేదల్లో మరింత పేదలను సమ్మిళిత వృద్ధిలో భాగస్వాములను చేయడానికి, వివిధ కారకాల పరంగా వారు పేదరికంలో మిగిలిపోకుండా ఉండటానికి ఈ బహుముఖ పేదరిక గణన సూచీ ఉపకరిస్తుంది. ఈ నేపథ్యంలో ఇటీవల నీతి ఆయోగ్, 2005-06 నుంచి ప్రస్తుత కాలం వరకు బహుముఖ పేదరిక స్థాయిల్లో వచ్చిన మార్పులపై సూచీ నివేదికను గత 15 సంవత్సరాల కాలానికి గణించి విడుదల చేసింది.

**బహుముఖ పేదరిక సూచీ (ఎన్‌పీఐ) నివేదిక గణాంకాలు**

- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) 3, 4, 5 రౌండ్ల నుంచి 2005-06, 2015-16, 2019-21 మధ్య కాలానికి బహుముఖ పేదరిక సూచీలోని 12 కొలమానాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఈ సూచీని రూపొందించారు.
- ఈ సూచీలో ఉన్న 12 బహుముఖ కొలమానాల పరంగా 1/3వ వంతు లేదా 30 శాతం కంటే ఎక్కువ అంశాల్లో లేమిని ఎదుర్కొంటున్న వారిని బహుముఖ పేదలుగా గుర్తిస్తారు.
- ఈ సూచీలో హెడ్ కౌంట్ రేషియో (తలల లెక్కింపు పద్ధతిలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారి శాతంగా), ఇంటెన్సిటీ (దారిద్ర్య రేఖ దిగువన ఉన్న ప్రజలు సగటున బహుముఖ కొలమానాల పరంగా ఎదుర్కొంటున్న లేమి పరంగానూ) పేదరికాన్ని వ్యక్తీకరించి ఈ రెండు అంశాల ఆధారంగా నిర్మించే బహుముఖ పేదరిక సూచీ విలువ పరంగానూ పేదరిక అంచనాలను వేశారు.

**బహుముఖ పేదరిక అంచనాలు**

| NFHS కాలం | హెడ్ కౌంట్ రేషియో (హెచ్)% | ఇంటెన్సిటీ (A)% | MPI= H*A |
|---|---|---|---|
| 2019-21 | 14.96 | 44.39 | 0.066 |
| 2015-16 | 24.85 | 47.14 | 0.117 |
| 2005-06 | 55.34 | 54.96 | 0.304 |

- ఈ అంచనాల ప్రకారం 2005-06 నుంచి 2019-21 మధ్య 15 ఏండ్ల కాలంలో జనాభాలోని బహుముఖ పేదల శాతంలో 40.38 పర్సంటేజ్ పాయింట్లు తగ్గి విశేష మార్పు కనిపించింది. అంటే 2005-06లో జనాభాలో దాదాపు సగంపైనే (55.34 శాతం) ఉన్న పేదల సంఖ్య 2019-21 నాటికి 14.96 శాతానికి తగ్గింది. 2022-23 నాటికి ఇది 11.28 శాతానికి తగ్గిందని అంచనా.
- అదేవిధంగా పేదరిక రేఖకు దిగువన ఉన్నవారు ఎదుర్కొంటున్న బహుముఖ లేమిల సగటు స్థాయి కూడా (ఇంటెన్సిటీ) 15 ఏండ్లలో 54.96 శాతం నుంచి 44.39 శాతానికి తగ్గి 10.57 పర్సంటేజ్ పాయింట్ల తగ్గుదలను నమోదు చేసింది. ఇది బహుముఖ పేదరిక రేఖ దిగువన ఉన్న వారిలో బహుళ కొలమాన అంశాల పరంగా మెరుగుదలను సూచిస్తుంది. తద్వారా పై రెండు అంశాల సమాహారంగా గణించే బహుముఖ పేదరిక సూచీ విలువ (ఎంపీఐ)లో కూడా ఈ 15 ఏండ్ల కాలంలో సకారాత్మక తగ్గుదల నమోదైంది. ఈ విలువ 2005-06లో 0.304 ఉండగా 2019-21 నాటికి 0.066కు తగ్గింది.
- అదేవిధంగా హెడ్ కౌంట్ రేషియో పరంగా బహుముఖ పేదరికం 2005-06 నుంచి 2015-16 మధ్యగల దశాబ్దంలో వార్షిక తగ్గుదల రేటు 7.7 శాతం ఉండగా ఆ తదుపరి అర్ధ శతాబ్దంలో (2015-16 నుంచి 2019-20 వరకు) మరింత వేగం పుంజుకొని వార్షికంగా 10.6 తగ్గుదల రేటును నమోదు చేసింది.
- అయితే ఇంటెన్సిటీ స్థాయి విషయంలో మాత్రం 2005-06, 2015-16 దశాబ్ద కాలం సగటు వార్షిక తగ్గుదల రేటు (-1.52)తో పోలిస్తే, 2015-16, 2019-20 అర్ధ దశాబ్ద కాలంలో వార్షిక తగ్గుదల రేటు (-1.33) కొద్దిగా నెమ్మదించడం కనిపిస్తుంది.
- అయితే ఎంపీఐ విలువ తొలి దశకం (2005-06, 2015-16 మధ్య కాలం)లో నమోదైన వార్షిక రేటు (-9.11) కంటే మలి అర్ధ దశకం (2015-16, 2019-20 మధ్య) కాలంలో (-11.95) వార్షిక తగ్గుదల రేటులో పురోగమించి 31 శాతం తగ్గుదల వృద్ధి కనబరిచింది.

**దశాబ్దాలవారీ బహుముఖ పేదరిక వార్షిక తగ్గుదల రేటు**

| కాలం | హెడ్ కౌంట్ రేషియో (H) | ఇంటెన్సిటీ | MPI= H*A |
|---|---|---|---|
| 2015-16 - 2019-20 | -10.66 | -1.33 | -11.95 |
| 2005-06 - 2015-16 | -7.69 | -1.52 | -9.11 |

**నివేదికలోని ముఖ్యాంశాలు**

- బహుముఖ పేదరికంలో గణనీయ తగ్గుదల: 2013-14లో 29.17 శాతంగా ఉన్న బహుముఖ పేదరికం 2022-23 నాటికి 11.28 శాతానికి తగ్గి తొమ్మిదేండ్ల కాలంలో 17.89 శాతం పాయింట్ల తగ్గుదలను నమోదు చేసింది.
- గత 9 ఏండ్ల కాలంలో (2013-14 - 2022-23) దేశ వ్యాప్తంగా 24.82 కోట్ల మంది ప్రజలు బహుముఖ పేదరికం నుంచి బయటపడ్డారు.
- రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 5.94 కోట్ల మంది బహుముఖ పేదరికం నుంచి బయటపడగా తర్వాత స్థానాల్లో బిహార్ (3.77 కోట్ల మంది), మధ్యప్రదేశ్ (2.30 కోట్ల మంది), రాజస్థాన్ (1.87 కోట్ల మంది) ఉన్నాయి.
- 12 కొలమాన అంశాలకు సంబంధించి గణనీయ అభివృద్ధి సాధించడం జరిగింది. తద్వారా 2030 నాటికి దేశ బహుముఖ పేదరికం కనీసం సగానికి తగ్గనుండటంతో భారతదేశం సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (1.2) సాధనలు విజయం సాధించగల సంకేతాలు కనిపిస్తున్నాయి.
- 2005-06 కాలంలో జీవన ప్రమాణాల పరంగా వంట ఇంధన (74.40 శాతం), పారిశుద్ధ్యం (70.92 శాతం), బ్యాంకు ఖాతాలు (58.11 శాతం) వంటి కొలమాన అంశాలు అత్యంత కొరతతో ఉన్నాయి.
- అయితే ఇదే కాలంలో బాలలు, కౌమార మరణాల రేటు (4.84 శాతం), పాఠశాల హాజరు (21.27 శాతం), తాగునీరు (21.34 శాతం) అంశాల పరంగా మెరుగుదల ఉంది (Lowest level of Deprivation)
- 2019-21, ప్రస్తుత తాజా అంచనాల పరంగా చూస్తే వంట ఇంధనం (43.90), గృహ సౌకర్యాలు (41.37 శాతం) ఇప్పటికీ అత్యంత కొరతతో ఉన్నాయి (Highest level of Deprivation).
- అయితే బాలలు, కౌమార మరణాలు (2.06 శాతం), విద్యుత్ (3.27 శాతం), బ్యాంకు ఖాతాలు (3.69 శాతం) మాత్రం అతి తక్కువ స్థాయి కొరత కలిగి ఉన్నాయి.

**బహుముఖ పేదరికం తగ్గడానికి సహకరించిన ప్రభుత్వ విధానాలు**

- 'ఎనిమియా ముక్త్ భారత్', 'పోషణ్ అభియాన్' పథకాలు ఆరోగ్య సూచీ మెరుగుదలకు సహకరించి బహుముఖ పేదరిక తగ్గుదలలో కీలక పాత్ర పోషించాయి.
- భారత ప్రభుత్వం 'లక్షిత ప్రజాపంపిణీ విధానం' ద్వారా ప్రపంచంలోనే అతిపెద్ద ఆహార భద్రతా కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా 5.4 లక్షల చౌకధరల దుకాణాల ద్వారా అమలు చేస్తున్నది. జాతీయ ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేస్తూ 81.35 కోట్ల మంది లబ్ధిదారులకు (జనాభాలో 75 శాతం గ్రామీణ జనాభాకు, 50 శాతం పట్టణ జనాభాకు) ఆహార పంపిణీ చేస్తున్నది.
- కరోనా సమయంలో 'గరీబ్ కల్యాణ్ అన్న యోజన'ను ప్రారంభించి పేదలకు ఉచితంగా ఆహార ధాన్యాల పంపిణీని చేపట్టిన ప్రభుత్వం ఆ పథకాన్ని ఇటీవల మరో ఐదు సంవత్సరాల పాటు పొడిగించింది.
- 'ప్రధాన మంత్రి పోషణ్ శక్తి నిర్మాణ్ (పీఎం పోషణ్) పథకం ద్వారా విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తూ పోషకాహార లోప సమస్యను, పాఠశాలల్లో నమోదు నిష్పత్తి సమస్యను ఏక కాలంలో పరిష్కరిస్తున్నది.
- అంగన్వాడీల ద్వారా కూడా బాలలకు పూర్వ ప్రాథమిక విద్యను, పోషకాహారాన్ని అందిస్తుంది. అంతేకాక ఇదే అంగన్వాడీల ద్వారా గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి పోషకాహాన్ని అందిస్తూ దాదాపు 14 లక్షల అంగన్వాడీ కేంద్రాల ద్వారా 8.87 కోట్ల మంది 6 సంవత్సరాల్లోపు పిల్లలు, 1.1 కోట్ల మంది గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నది.
- 'ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్' ద్వారా గర్భిణుల ఆరోగ్యాన్ని పరిక్షించడమే కాకుండా సురక్షిత ప్రసవాలకు, మాతా శిశు మరణాల నివారణకు వివిధ చర్యల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తున్నది.
- ఉజ్వల్ యోజన ద్వారా 10 కోట్ల ఎల్‌పీజీ కనెక్షన్లు అందించి 31 కోట్ల మందికి పొగ రహిత సురక్షిత వంట ఇంధనాన్ని ప్రభుత్వం చేకూరుస్తుంది. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళల శ్వాస కోశ వ్యాధుల నివారణకు తోడ్పడుతున్నది.
- సౌభాగ్య యోజన ద్వారా దాదాపు 100 శాతం గృహాలకు విద్యుత్ కనెక్షన్లు, స్వచ్ఛ భారత్ మిషన్, జల్‌జీవన్ మిషన్ ద్వారా పారిశుద్ధ్య, సురక్షిత తాగునీటి సౌకర్యాలు కల్పిస్తూ ప్రజలకు ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలను అందిస్తున్నది.
- 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' వల్ల దేశ వ్యాప్తంగా 50 కోట్ల కొత్త బ్యాంకు ఖాతాలు తెరిచారు. అట్టడుగు వర్గాల ఆర్థిక సమ్మిళితత్వానికి ఇది తోడ్పడుతున్నది.
- ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన ద్వారా 4 కోట్ల గృహాలు నిర్మించబడి అట్టడుగు వర్గాలకు సురక్షిత ఆవాసాలు లభించి వారి జీవన ప్రమాణ స్థాయి పెరిగాయి.
- ఈ విధంగా 2005-06 నాటికి దేశ జనాభాలో 55.34 శాతంగా ఉన్న బహుముఖ పేదరికం 2022-23 నాటికి 11.28 శాతానికి తగ్గి 24.82 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయటపడటానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు విశేషంగా సహకరించాయి.
- అయితే నిజంగా పేదరిక స్థాయిలు తగ్గాయా, ఆర్థిక అంతరాలు నిర్మూలించబడ్డాయా, వనరుల పంపిణీ సమానంగా జరుగుతున్నాయా, ప్రజల జీవన ప్రమాణాలు పెంచే స్థాయిలో వారికి సుస్థిర ఉపాధి లభిస్తుందా అనే కోణంలో ఆలోచిస్తే మాత్రం ఈ నివేదిక పాక్షిక సత్యాన్నే తెలుపుతుందని చెప్పుకోవచ్చు. నిజానికి పేదరిక స్థాయి గత దశాబ్దంన్నర కాలంలో తగ్గడానికి ప్రధాన కారణం ప్రభుత్వం భారీ స్థాయిలో చేపడుతున్న ఉచిత పథకాలు. ఇవి తాత్కాలికంగా మాత్రమే బహుముఖ పేదరికాన్ని తగ్గించగలవు. పూర్తిస్థాయిలో బహుముఖ పేదరికాన్ని నివారించాలంటే దేశంలో 5 శాతం మంది చేతిలో కేంద్రీకృతం అయిన 60 శాతం సంపదను, కేవలం 3 శాతం మాత్రమే పొందుతున్న ఆర్థికంగా దిగువన ఉన్న 50 శాతం మంది ప్రజలకు విస్తరించే ఆర్థిక సమ్మిళిత చర్యలను చేపట్టాల్సి ఉంది. వ్యవస్థీకృత ఉపాధి సౌకర్యాలు పెంచడం ద్వారా జీవన ప్రమాణాలను పెంచాలి. అప్పుడే బహుముఖ పేదరికాన్ని సమర్థవంతంగా నివారించగలం.

### బహుముఖ పేదరిక సూచీ కొలమానాలు, వాటి భారత్వాలు

I. ఆరోగ్య కొలమానాలు (1/3 ఉమ్మడి భారత్వం)
   1) పోషణ (1/6 ఉప భారత్వం)
   2) బాలలు, కౌమార మరణాలు (1/12 ఉప భారత్వం)
   3) ప్రసూతి ఆరోగ్యం (1/12 ఉప భారత్వం)

II. విద్యా కొలమానాలు (1/3 ఉమ్మడి భారత్వం)
   4) పాఠశాల విద్యాకాలం (1/6 ఉప భారత్వం)
   5) పాఠశాల హాజరు (1/6 ఉప భారత్వం)

III. జీవన ప్రమాణ కొలమానాలు (1/3 ఉమ్మడి భారత్వం)
   6) వంట ఇంధనం (1/21 ఉప భారత్వం)
   7) పారిశుద్ధ్యం (1/21 ఉప భారత్వం)
   8) తాగునీరు (1/21 ఉప భారత్వం)
   9) గృహ సౌకర్యం (1/21 ఉప భారత్వం)
   10) విద్యుత్ (1/21 ఉప భారత్వం)
   11) ఆస్తులు (1/21 ఉప భారత్వం)
   12) బ్యాంకు ఖాతా (1/21 ఉప భారత్వం)

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

